క్లుప్తంగా

విగ్రహాల ఏర్పాటుకు విరాళం

నర్వ: మండలంలోని రాయికోడ్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న సావిత్రిబాయిపూలే, జ్యోతిరావుపూలే విగ్రహాల ఏర్పాటుకు నర్వ బీఆర్ఎస్ నాయకులు దండు అయ్యప్ప విరాళం అందించారు. గ్రామ విగ్రహ ఏర్పాటు కమిటీకి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపాల్, శంకర్, రవికుమార్, అమ్రేష్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం నర్సిములు, రాంపూర్ శంకర్, బొజ్జన్న, హన్మంతు, తదితరులున్నారు.

వృథా అవుతున్న విద్యుత్

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోందని ప్రజలు అంటున్నారు. వడ్వాట్, అమ్మపల్లి, గజ్జరందొడ్డి, మందిపల్లి, నెరడగందొడ్డి, కొత్తపల్లి, వర్కూర్, నేరడగం, మాగనూర్ గ్రామాల్లోని పలు కాలనీల్లో 24 గంటల పాటు విద్యుత్ దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు చూసి, చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో వీధి దీపాలను ఆన్ చేసి ఉదయం వేళల్లో బంద్ చేయాల్సి చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని చెబుతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయండి

మరికల్: మండలంలోని పల్లెగడ్డ గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు హన్మంతు, రాములు, వెంకటన్నలు అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం నాలుగేళ్ల బాలుడు ఆటలు ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కే ప్రయత్నం చేస్తుండగా గమనించిన గ్రామస్తులు అతడి కాపాడారన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా



ధన్వాడ: కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. వేగంగా వెళ్తుండగా క్రమంలో గ్రామంలోని కల్వర్టు వద్ద మనుషులు అడ్డువచ్చారు. ఈ క్రమంలోనే అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టులో పడింది. కాగా ఎవరికీ తీవ్రంగా గాయాలు కాలేదు. డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి.

కన్మనూర్ సబ్‌స్టేషన్ పూర్తి చేయాలి

మరికల్: మండలంలోని కన్మనూర్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు తర్వగా పూర్తి చేయాలని రైతులు శశిందర్‌రెడ్డి, రాములు, నర్సిములు ఆదివారం విలేకర్లతో అన్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన పనులు నేటికి పూర్తి కాలేదని పేర్కొన్నారు. లోవోల్టేజీతో వ్యవసాయ విద్యుత్ మోటార్లు దెబ్బతింటున్నాయని వెంటనే పనులు పూర్తిచేసి సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

'డబుల్' ఇళ్లు నిర్మించాలి

మరికల్: మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్, వీరన్న, రామకృష్ణలు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యిందని, ఇళ్ల మాటను పక్కన పెట్టిందని పేర్కొన్నారు. పెరిగిన స్టీల్, సిమెంట్ ధరల కారణంగా సొంతింటిని నిర్మించుకోలేని దీనస్థితిలో ఉన్న పేదల కోసమైనా ప్రభుత్వం పల్లెల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని అందులో డిమాండ్ చేశారు.

ప్రైవేట్ వాహనదారుల ఇష్టారీతి

కోస్గి: పట్టణంలో ప్రైవేట్ వాహనదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఏకంగా ఆర్టీసీ బస్టాండ్‌లో నుంచే ప్రయాణికులను తరలిస్తున్నారు. వారిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరిస్తోందని స్థానికులు అంటున్నారు. అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేట్ ఆటోలు, ఇతర వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాజాపూర్‌లో గ్రంథాలయం ఏర్పాటు

నారాయణపేట రూరల్ : మండలంలోని జాజాపూర్ గ్రామంలో రిటైర్డ్ డీఈఓ ఆవుటి జగదీశ్వర్ సొంత డబ్బులతో గ్రంథాలయం ఏర్పాటు చేశార. తన తండ్రి ఆవుటి సిద్ధన్న జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేపట్టాలనే సంకల్పంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇక్కడ 5వేల పుస్తకాలు, మాస, దిన పత్రికలతో పాటు కంప్యూటర్, ఫర్నీచర్‌ను పెట్టామన్నారు. అదేవిధంగా చలివేంద్రం సైతం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో విద్యార్థులు, యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య చర్యలు శూన్యం

- నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనం
- పెరుగుతున్న దోమలు, ఈగల బెడద
- వ్యాధులబారిన పడుతున్నా పట్టించుకోని యంత్రాంగం



పట్టణంలోని టీచర్స్ కాలనీలో నిలిచిన మురుగు నీరు

నారాయణపేట టౌన్ : పట్టణంలో పారిశుద్ధ్య పనులు అటకెక్కాయి. నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలాచోట్ల డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మురుగనీరు ఇళ్ల మధ్య నిలుస్తోంది. దీంతో దోమలు, ఈగల బెడద పెరిగిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధుల బారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. పట్టణంలో టీచర్స్ కాలనీ, సాయివిజయ్ కాలనీ, బీసీ కాలనీ, అశోక్‌నగర్, భీవండికాలనీ, పళ్ల, శ్రీనగర్‌కాలనీ తదితర చోట్ల మురుగునీరు రోడ్లపై నిలుస్తోంది. దోమల బెడద పెరగడంతో పలుమార్లు విన్నవించగా మూడు నెలల కిందట అక్కడక్కడ కంటితుడుపుగా దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఫాగింగ్ చేపట్టారు. కాగా ప్రస్తుతం దోమల సమస్యతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

శ్రీనగర్ కాలనీలో డ్రెయినేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్ల, ఇళ్లమధ్య మురుగునీరు పారుతోంది. దీంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు, ఈగల బెడద పెరిగిపోయింది. వ్యాధుల బారినపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– కృష్ణ, శ్రీనగర్ కాలనీ, నారాయణపేట

చర్యలు తీసుకుంటున్నాం

దోమల బెడద తప్పించడం కోసం ఫాగింగ్ చేపట్టాలని సిబ్బందికి సూచించాం. అలాగే మురికి కుంటలుగా ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి. డ్రెయినేజీలలో చెత్త వేయరాదు.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

నత్తనడకన సాగుతున్న పనులు



నిర్మాణంలో ఉన్న మరికల్ కస్తూర్బా భవనం

మరికల్: మండలంలోని పస్పుల శివారుల్లో కస్తుర్బా గాంధీ పాఠశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సొంత భవనం లేకపోవడంతో మరికల్ పాఠశాల ధన్వాడ కస్తుర్బా కొనసాగుతోంది. రెండూ ఒకే భవనంలో కొనసాగడం వల్ల విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ప్రచారకర్తలు

కోస్గి: ఆరోగ్యకరమైన జీవనానికి ధ్యానం అవసరం అని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రచారకర్తలు ఆంజనేయరెడ్డి, బాలకృష్టారెడ్డిలు అన్నారు. నేడు ఏ ఇంట్లో చూసినా బీపీ, షుగర్‌లతో బాధపడుతున్న వారు కనిపిస్తున్నారని, ప్రతి మనిషి వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిరోజు 15 నిమిషాలపాటు శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయడం వల్ల ఎలాంటి దీర్ఘకాలిక రోగాలు దరిచేరవన్నారు. ఈ మేరకు ఆదివారం గుండుమాల్ మండల పరిధిలోని అమ్లికుంట్ల, కోస్గి మండల పరిధిలోని సారంగరావు పల్లె, మల్‌రెడ్డిపల్లిల్లో ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ధ్యానం చేసే విధానాన్ని సమగ్రంగా వివరించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పూజ నిర్వహిస్తున్న సర్పంచ్ తిమ్మప్ప



పెదిరిపాడ్‌లో..

మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ భూమి పూజ చేశారు. రూ. 20లక్షలతో గ్రామంలోని మూడవ వార్డులో దాదాపుగా 160 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని వీధుల్లో సీసీ, డ్రెయినేజీల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. ఎంపీటీసీ లక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ అంజమ్మ, నాయకులు శంకర్, తాయప్ప, హన్మంతు, మాజీ సర్పంచ్ అంజప్పగౌడ, సోమప్పగౌడ్, దేవరాజ్‌గౌడ్, రజాక్, అంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆదివారం పెదిరిపాడ్‌లో ప్రారంభించారు. జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ బాలప్పలు ప్రారంభించారు. రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో మెగా వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న రాజమల్లేష్

నర్వ: ప్రతి ఒక్కరు తమకు సమాజం ఏం ఇచ్చింది అనే కంటే సమాజానికి తాము ఏం ఇస్తున్నామనే దానిపై దృష్టి పెట్టాలని రామకృష్ణ, వివేకనందా సేవా సమితి జిల్లా కన్వీనర్ రాజమల్లేష్ అన్నారు. ఆదివారం రాయికోడ్ గ్రామంలో సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ప్రారంభంలో రామకృష్ణ పరమహంస, స్వామి వివేకనంద చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో యువత మద్యానికి బానిసలు కాకుండా సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరు ఒక ఉన్నత మార్గాన్ని ఎంచుకోని అందుకోసం శ్రమించి సాధించాలన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంకిషన్ మాట్లాడుతూ.. ప్రజల్లో సామాజిక రుగ్మతలను, ఆరోగ్య సమస్యలను తొలగించేందుకు సేవాసమితి చేపట్టిన వైద్యశిబిరాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అనంతరం వివిధ విభాగాల వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అక్కడే ఉచిత మందులను అందించారు. దీర్ఘకాలిక రోగులకు అత్యవసర చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. దాదాపు 500 మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్యులు శ్రీధర్‌రెడ్డి, జేజీ శంకర్, వెంకట్రాంరెడ్డి, అపర్ణ, శ్వేత, శివానంద్, రామాంజనేయులు, దేవీ ప్రసాద్, అవేజ్, ఆకాష్‌లతో పాటు ఇతర సిబ్బంది, ఎంపీపీ జయరాములుశెట్టి, గ్రామ సర్పంచ్ సుశీల, ఉపసర్పంచ్ తాయన్నగౌడ్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో వారం రోజుల క్రితం మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని ఆదివారం మాజీ స్టేట్ ట్రేడ్‌యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ దేవరి మల్లప్ప పరామర్శించారు. వెంకట్ రెడ్డి భార్యకు 5వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉద్యమంలో పాల్గొన్న నాయకులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. మాజీ మండల అధ్యక్షులు కృష్ణయ్య, కృష్ణామీనన్, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నారాయణపేట రూరల్ : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులకు సింగారం వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ తారస పడింది. వెంటనే పోలీసులు తాయమ్మ గుడి దగ్గర ట్రాక్టర్‌ను అడ్డగించి అనుమతి పత్రాలు చూయించాలని డ్రైవర్‌ను కోరగా అక్రమంగా తీసుకుని వెళ్తున్నట్లు తేలింది. దీంతో వాహనాన్ని వెంటనే పీఎస్‌కు తరలించామని, ట్రాక్టర్ యజమాని సింగారం గ్రామానికి చెందిన లక్ష్మప్ప అని డ్రైవర్ చెప్పడంతో ఆయనపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రాజ్యాధికార యాత్రకు తరలిన నాయకులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు

మాగనూర్(మక్తల్): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అలంపూర్‌లో చేపట్టిన రాజ్యాధికార యాత్రకు నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు ముదిరాజ్, ఇతర నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్క పనిచేయాలని కోరారు. కొంత మంది సంపన్నుల చేతిలో రాజ్యధికారం పెట్టి మోసపోతున్నామని ఇప్పటికైనా బహుజనులు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కందూకూరి శ్రీనివాసులు, ఆయా మండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

సావర్కర్ సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కర్ వర్ధంతిని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. పాతబస్టాండ్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి బీజేవైఎం నాయకులు పూలమాల వేసి, రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ రక్షణలో ఆయన ఎంతో సాహసోపేతంగా వ్యవహరించారని, ఆయన ప్రతి ఒక్కరికి ఆదర్శణీయుడని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు కృషిచేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, మోహన్, అర్జున్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రముఖ కవికి తులాభారం



నారాయణపేట టౌన్: ప్రముఖ తెలుగు కవి రామ్మోహన్ రావ్ షష్టి పూర్తి మహోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులతో పాటు కవులు ఆదివారం భాస్కర నిలయంలో రామ్మోహన్‌రావ్ దంపతులకు బంగారు, వెండి, తులసి, బెల్లం, నవధాన్యాలతో తులాభారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ హాజరై మాట్లాడారు. రామ్మోహన్‌రావ్‌ను కొనియాడారు. అనంతరం పూలమాల, శాలువా, జ్ఞాపికలతో కవి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్, మున్సిపల్ కౌన్సిలర్ సత్యరఘుపాల్‌రెడ్డి, శక్తి పీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద పురోహిత్, యజ్ఞ నారాయణ పురోహిత్, గాయకులు సంగ నర్సిములు, మహిపాల్‌రెడ్డి, వేద పండితులు వెంకుశాస్త్రి, సీతారాం శాస్త్రి, కుంభన్న శాస్త్రి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖులు, పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్ : ఈ చిత్రంలోని వారంతా 40ఏళ్ల కిత్రం కలిసి చదువుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1982–84 బ్యాచ్‌లో ఇంటర్ పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత ఎవరికి వారు విభిన్న రకాలైన కోర్సుల్లో చేరి, వేర్వేరు ఉద్యోగాల్లో స్థిర పడ్డారు. అందులో కొందరు పదవీ విరమణ సైతం పొందారు. వీరంతా కలిసి ఆదివారం స్థానిక అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో కలుసుకున్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు వారి జీవిత విశేషాలు, కుటుంబం, ఉద్యోగ జీవితాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేశారు. మొత్తం బ్యాచ్‌లో 150 మందికి గాను 85 మంది హాజరయ్యారు. కువైట్‌లో స్థిరపడ్డ సుజాత సైతం హాజరయ్యారు. కార్యక్రమంలో మాగనూర్ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ రిజిస్టర్ నాగార్జున్, పాలమూర్ ఎంపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ భీంరెడ్డి, నారాయణపేట డీప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ, ప్రభుత్వ ఉపాధ్యాయులు రాంసుధాకర్, వివేకానంద, శంకమ్మ, శివలింగమ్మ, విద్యావతి, రాజేందర్, మంజుళ, శశికళ, బీఆర్ఎస్ నాయకులు పాడువల్లి రాములు, మాజీ వార్డు కౌన్సిలర్ గోవింద్‌పసారి, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ గౌస్, వెంకటవరప్రసాద్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

మాలధారణ భక్తికి నిదర్శనం



పండ్లు పంపిణీ చేస్తున్న భీమయ్య

నారాయణపేట టౌన్ : భక్తి నిదర్శనం హనుమాన్ మాలధారణం అని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు కాకర్ల భీమయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాయివిజయ్‌కాలనీలో తోట హనుమాన్ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాలధారులకు పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని, భగవంతుని సేవలో తరించాలన్నారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ గురు స్వాములు హన్మంతు శరణప్పచారి, అఖిల్, శ్రీకాంత్, బాల్‌రాజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

మాగనూర్: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16 సం) శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితకుటుంబం తెలిపిన వివరాల ప్రకారం సదరు బాలిక రాత్రి 11:30 గంటల సమయంలో కాలకృత్యాలకని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లింది. ఎంత సేపటికీ తిరగిరాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు చుట్టు పక్కల, బంధువల ఇళ్లలో వెతకగా ఆచూకీ లభించలేదు. బాలిక స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుందని ఆమె తండ్రి తెలిపారు. ఆమె అదృశ్యం విషయంలో ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అంజన్‌రావు తెలిపారు.

దేశ ఔన్నత్యాన్ని చాటడమే లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న సంఘ్‌సేవకులు



మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

నర్వ: భారతీయుల్లో దేశభక్తిని ప్రజ్వలింపచేసి భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచదేశాలకు చాటడమే లక్ష్యమని ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవహా విశ్రాంత ఉపాధ్యాయులు లింగన్న అన్నారు. ఆదివారం నర్వలో ఖండ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు మూడు ఖండాల(మరికల్, ధన్వాడ, నర్వ) సంఘ్ కార్యకర్తలు నర్వ పురవీధుల గుండా పథసంచలన్ నిర్వహించారు. ప్రత్యేక వాహనం ముందుండగా పలువురు ప్రత్యేక పూలవర్షం కురిపించారు. అనంతరం స్వయం సేవకులు సంఘ్ ఘనావేష్ ధరించి కర్రసాము ప్రదర్శించారు. అనంతరం పెట్రోల్ బంక్ సమీపంలోని మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య వక్త దోసూరి రాము, ముఖ్య అతిథులు లింగన్నలు సంఘ్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం సంఘ్ పనిచేస్తుందని, ఏ కులాలకు, ఏ మతాలకు వ్యతిరేకం కాదన్నారు. భారతదేశం హిందు దేశమని, ప్రపంచ దేశాల కంటే మన దేశం మన ధర్మం గొప్పదన్నారు. రైతులు సాంప్రదాయ వ్యవసాయ పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. ఉన్నతమైన విలువలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్య, ఆర్ఎస్ఎస్ నాయకులు జిల్లా కార్యవహా దర్పల్లి కుర్మయ్య, యాంకి రమేష్, లక్ష్మీకాంత్, గుజ్జుల వెంకటేష్, మరో 300 మంది సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొలెరో ఢీ : వ్యక్తికి తీవ్ర గాయాలు

మాగనూర్(మక్తల్): ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటనిది. మక్తల్ మండల పరిధిలోని కాచ్వార్ గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ని గ్రామానికి చెందిన ఈద నరసింహ ద్విచక్రవాహనంపై అత్తవారి ఊరైన సామాన్‌పల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం ఆయన ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో నరసింహ కాలు విరగడంతో పాటు తల భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని వెంటనే చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మద్దూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైన ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్ సూచించారు. ఆదివారం మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్‌మీటింగ్ నిర్వహించారు. గ్రామంలోని పోలింగ్ బూత్ 75, 76, 77, 88, 89ల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రం ప్రభుత్వ పెద్దలు కేంద్ర నిధులతో గ్రామాలను అభివృద్ధి పనులు చేపట్టి తామే చేసినట్లుగా చెప్పుకుంటున్నారని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. గ్రామంలోని ప్రతి కార్యకర్త రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి కృషిచేయాలని కోరారు.